ఓయూలో సైన్స్ మార్చ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఇండియా మార్చ్ ఫర్ సైన్స్ హైదరాబాద్ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఓయూ క్యాంపస్‌లో సైన్స్ మార్చ్ జరిగింది. శుక్రవారం క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కాలేజీ నుంచి విద్యానగర్ హిందీ మహావిద్యాలయం వరకు జరిగిన మార్చ్‌లో అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం జరిగిన సదస్సులో ఎన్ఐటీ ప్రొ.రామచంద్రయ్య, గంగాధర్, ఎన్ఐఎన్ సైంటిస్ట్ మెహత్ ఎస్ బాంజీ పాల్గొని ప్రసంగించారు.

1న బీజేపీ కార్యాలయం ముట్టడి

ఉస్మానియా యూనివర్సిటీ: పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని, లేని పక్షంలో సెప్టెంబర్ 1న రాష్ట్ర బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు బీసీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ముబోయిన సైదులు హెచ్చరించారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా తెలంగాణ ఎంపీలు పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ల బిల్లుకు కేంద్రం ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు భారీ అశోక్‌కుమార్, బీసీ విద్యార్థి కన్వీనర్ లింగయ్యయాదవ్, మధు, సురేశ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ స్క్రీనింగ్ క్యాంప్

లాలాపేట: టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా తార్నాక డివిజన్ లాలాపేట ఇందిరానగర్ బీ– కాలనీలో లాలాపేట టీబీ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం టీబీ స్క్రీనింగ్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. పలువురికి టీబీ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కేవలం దగ్గు ఒక్కటే టీబీ లక్షణం కాదని జ్వరం, తెమడలో రక్తం పడటం, బరువు తగ్గడం, అలసట, నీరసం వంటి లక్షణాలు ఉన్నాయని వివరించారు. టీబీ నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా వైద్యం తీసుకోవడం ద్వారా నయం చేసుకోవచ్చునని తెలిపారు. దీంతో పాటుగా వైరల్ జ్వరంతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లాలాపేట టీబీ యూనిట్ ప్రతినిధులు, ఇందిరానగర్ బీ– కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహేశ్, ఆశవర్కర్లు తదితరులున్నారు.

కారు సీజ్ చేయడం దారుణం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ ఫొటో గల తన కారును పోలీసులు సీజ్ చేడయం దారుణమని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ మండిపడ్డారు. బీఆర్ఎస్ హయంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఓయూ క్యాంపస్‌లో హాస్టల్ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకాలను తొగించొద్దని ప్రెస్‌మీట్ ఏర్పాటు చేయగా, అకారణంగా పోలీసులు కారును తీసుకపోవడం బాధకరమన్నారు. కారు కోసం మరుసటి రోజు పోలీస్ స్టేషన్‌కు వెళ్తే, మాజీ సీఎం కేటీఆర్ ఫొటో ఉన్నందున కారును సీజ్ చేశామని కోర్టు నుంచి తీసుకోవాలని చెప్పడం దుర్మార్గమన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

సనత్‌నగర్: సికింద్రాబాద్ జింఖానా మైదానం ప్రహరీ గ్రిల్స్‌కు తాడుతో ఉరేసుకొని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. శుక్రవారం తెల్లవారుజామున 6 గంటల సమయంలో మార్నింగ్ వాకింగ్ కోసం వెళ్లిన వాకర్స్ అనుమానాస్పదంగా ఓ వ్యక్తి ఉరివేసుకొని ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న బేగంపేట పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. అయితే మృతుడికి సంబంధించి వివరాలు లభ్యం కాలేదు. మృతుడి సంబంధీకులు బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు తెలిపారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్కేసర్ –చర్లపల్లి రైల్వే స్టేషన్‌ల మార్గం మధ్యలోని పట్టాలపై శుక్రవారం సుమారు 40–45 మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనకనుంచి వచ్చిన రైలు ప్రమాదవశాత్తు ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి



అడ్డగుట్ట: అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్త్‌లాలాగూడ ఫ్రూట్స్ మార్కెట్ సమీపంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద నున్న ఫుట్‌పాత్‌పై గురువారం సుమారు 40 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సదరు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడికి ఆహారం దొరక్కపోవడంతో అనారోగ్యానికి గురై మరణించి ఉంటాడని వైద్యులు చెప్పినట్లు తెలిపారు.

వానొచ్చె...వరదొచ్చె



కవాడిగూడ గాయత్రి అపార్టుమెంట్ ముందు రోడ్డుపై వరదనీరు

బన్సీలాల్‌పేట్: ఏడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షాలకు పలు ప్రాంతాలు జలమయంగా మారాయి. పెద్ద ఎత్తున వర్షపునీరు రోడ్లపై పొంగి పొర్లింది. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మోండా మార్కెట్, రాణిగంజ్, ఆర్పీ రోడ్డు, కర్బలామైదాన్ చౌరస్తా, కవాడిగూడ గాయత్రి అపార్టుమెంట్ రోడ్డు, బోయిగూడ, బన్సీలాల్‌పేట్ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరింది. చాలా సేపటి వరకు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. వర్షానికి రోడ్లపై జనం తడిసిముద్దయ్యారు. ముఖ్యంగా మహిళలు, చిరువ్యాపారులు అవస్థలు పడుతున్నారు. బోయిగూడ ఫిలోమినా స్కూల్ నుంచి బోలక్‌పూర్ మేకల మండి వరకు రోడ్డుపై వరదనీరు ఉవ్వెత్తున ఎగిసి పడింది. ఈ రహదారి గుండా రాకపోకలు సాగించే జనాలు పడ్డ అవస్థలు అన్నీ ఇన్నీకావు. బస్తీల్లో వర్షానికి వీధులన్నీ బురదమయంగా మారాయి. వర్షం తాకిడి రోడ్లన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వర్షం కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం పట్టించుకోవడంలేదు.

నర్సిమోంజీ కళాశాలను మూసివేయాలి

లాలాపేట: ముంబాయి యూనివర్సిటీకి చెందిన నర్సిమోంజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెనేజ్‌మెంట్ స్టడీస్ కళాశాల తార్నాకలో అనుమతి లేకుండా కొనసాగుతుందని శుక్రవారం కళాశాల ఎదుట ఉస్మానియా ఐక్య విద్యార్థి సంఘాలు ఆరోపిస్తూ కళాశాల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నేతలు మాట్లాడుతూ తెలంగాణ ఉన్నత విద్యా మండలి నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే ప్రతీ సెమిస్టర్‌కు రూ 4.5 లక్షలు ఫీజుల రూపంలో విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యూజీసీ నిబంధనలు సైతం పాటించడం లేదన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ తెలంగాణ ఉన్నత విద్యా మండలికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ ధర్నాలో ఉస్మానియా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్రైస్తవ యువజన మహోత్సవాలకు తరలిరండి

రాంగోపాల్‌పేట్: అక్టోబర్ 1, 2వ తేదీల్లో కాకినాడలో నిర్వహించనున్న క్రైస్తవ యువజన మహోత్సవాలకు తరలి రావాలని సీవైఎఫ్ తెలంగాణ కో ఆర్డినేటర్ రావులపాటి మోజస్ యువతకు పిలుపునిచ్చారు. శుక్రవారం సికింద్రాబాద్ వైఎంసీలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన ఉత్సవాల జాతీయ కార్యదర్శి కలవల జాన్ విక్లిఫ్‌తో కలిసి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీవైఎఫ్ డైరెక్టర్ బీహెచ్‌వీ మూర్తిరాజుకు లండన్ పార్లమెంట్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు ఇచ్చారని తెలిపారు. సమావేశంలో రెవరెండ్ డాక్టర్ నవీన్ చిట్టాయ, రెవరెండ్ జాషస్ డేవిడ్, డేవిడ్ అబ్రహం, నానిబాబు, భాస్కర్, అరుణ్ పాల్గొన్నారు.

విజయేంద్రప్రసాద్‌ను కలిసిన బీజేపీ చీఫ్ రామ్‌చందర్‌రావు

లాలాపేట: తెలంగాణ బీజేపీ చీఫ్ ఎన్.రామ్‌చందర్‌రావు శుక్రవారం రాజ్యసభ సభ్యుడు డా.విజయేంద్రప్రసాద్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రామ్‌చందర్‌రావు పార్టీ పెద్దలను కలుస్తున్న నేపథ్యంలో బీజేపీ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న విజయేంద్రప్రసాద్‌ను కలిశారు. బీజేపీ అధికార ప్రతినిధి ఎన్.సుభాష్ పాల్గొన్నారు.

ఓయూ పీహెచ్‌డీ జాబితాను విడుదల చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: పీహెచ్‌డీ కోర్సులో సీట్లు సాధించిన విద్యార్థుల జాబితాను విడుదల చేయాలని టీజీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్ శుక్రవారం డిమాండ్ చేశారు. ఎంట్రన్స్ పరీక్షలు, ఫలితాలు, ఇంటర్వ్యూలు ముగిసినా అభ్యర్థుల జాబితాను విడుదల చేయడంలో జాప్యంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి పీహెచ్‌డీ జాబితాను విడుదల చేయాలన్నారు.

విజయవంతంగా ఉచిత వైద్య శిబిరం



సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

బొల్లారం: డివిజన్‌లోని ఎనిమిదవ వార్డులో సదర్ బజార్ డాక్టర్ ప్రతాప్‌గౌడ్ క్లినిక్ వద్ద యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో స్థానికులకు షుగర్, రక్తపోటు పరీక్షలు ఉచితంగా నిర్వహించడమే కాకుండా ఉచితంగా మందులు కూడా అందజేశారు. అలాగే క్షయవ్యాధి అవగాహనతో పాటు మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి సీజనల్ వ్యాధుల నివారణపై వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు శిబిరాన్ని నిర్వహించిన డాక్టర్ నాగార్జున, బాలమణి, రెణుక, జేమ్స్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాలరాజ్, సతీష్, గాంధీ, రాజు, నరేందర్, ధనంజయ్ చారి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

బీఏ అర్థశాస్త్రం పుస్తకం ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: బీఏ అర్థశాస్త్రం పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. నల్గొండ ఎకనామిక్స్ ఫోరం అధ్యక్షుడు డా.అక్కనపల్లి మీనయ్య రచించిన బీఏ ఎకనామిక్స్ సెమిస్టర్–1 పరీక్షకు కొత్త అర్థశాస్త్రం పుస్తకాన్ని రాష్ట్ర ఉన్నత విద్య మండలి వైస్‌చైర్మన్ ప్రొ. ఇటికాల పురుషోత్తం, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.కాశీం, తదితరులు ఆవిష్కరించిన్నట్లు నిజాం కాలేజీ పార్ట్ టైం అధ్యాపకులు డా.దుబ్బ రంజిత్ తెలిపారు.

లష్కర్‌లో అదనంగా 40 పోలింగ్‌బూత్‌ల ఏర్పాటు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు

జీహెచ్‌ఎంసీ డీసీ ఆంజనేయులు

సికింద్రాబాద్: నియోజకవర్గంలో అదనంగా 40 పోలింగ్‌బూత్‌లను ఏర్పాటు చేసినట్టు జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్, సికింద్రాబాద్ ఎన్నికల అధికారి ఆంజనేయులు ప్రకటించారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో డిప్యూటీ కమిషనర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పార్లమెంట్ ఎన్నికల వరకు నియోజకవర్గంలో 220 పోలింగ్‌బూత్‌లు మాత్రమే ఉండేవని చెప్పారు. పెంచిన 40 బూత్‌లు కలుపుకొని మొత్తంగా సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ పోలింగ్‌బూత్‌ల సంఖ్య 260కి చేరిందన్నారు. ఒక పోలింగ్‌బూత్‌లో 1200 ఓటర్లు మాత్రమే ఉండాలన్న కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శక సూత్రాల మేరకు అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానర్ పావని, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, ఎన్నికల విభాగం ఇన్‌చార్జి పవన్, బీఆర్ఎస్ నాయకుడు రాజసుందర్, కాంగ్రెస్ నాయకులు జలంధర్‌రెడ్డి, ప్రవీణ్ లాల్, బీజేపీ నాయకుడు ప్రకాశ్‌గౌడ్, బీఎస్పీ నాయకుడు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



అడ్డగుట్ట: మారేడుపల్లి మండల తహసీల్దార్ భీమయ్యగౌడ్ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయబోతున్న సందర్భంగా కాంగ్రెస్ కేకేసీ సికింద్రాబాద్ చైర్మన్ గంటరాజు సాగర్ నేతృత్వంలో పలువురు పార్టీ నేతలు మండల కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భీమయ్యను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. మండల పరిధిలోని ప్రభుత్వ భూములను సంరక్షించడంతో పాటు సకాలంలో సర్టిఫికెట్లు జారీ చేస్తూ ఎమ్మార్వో మంచి సేవలందించారని ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు నవీన్, భూపతి, వెలన్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ నేత విద్యార్థి పోరుబాట



ఓయూలో నిరసన చేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యారంగ సమస్యలపై పీడీఎస్‌యూ నాయకులు ఈ నెల 25 నుంచి 30 వరకు చేపట్టిన విద్యార్థి పోరుబాటలో భాగంగా ఓయూలో నిరసన చేశారు. శుక్రవారం పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ వేదికగా పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్ ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. జిల్లాకు ఒక ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలలకు, గురుకులాలకు సొంత భవనాలు, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీల పెంపు, ప్రభుత్వ కాలేజీలో చదివే ఇంటర్ విద్యార్థులకు ఐఐటీ, నీట్ తదితర పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ గ్రేటర్ అధ్యక్ష, కార్యదర్శులు రాకేష్, అనిల్, ఓయూ నేతలు రత్నశేఖర్, స్పందన, భారత్, సతీష్, హరికృష్ణ, హెచ్‌సీయూ నేతలు భీమ్‌సేన్, నవీన్, అభిరామ్, నిజాం కాలేజీ నాయకులు అనిల్, లోకేష్, మహేందర్, వినోద్,ఎ వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ పీడీఎస్‌యూ అధ్యక్షురాలు దీక్షిత, గ్రేటర్ నేత అని తదితరులు పాల్గొన్నారు.

తాగొద్దని వారించినందుకు వ్యక్తి ఆత్మహత్య

అమీర్‌పేట: వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట ధరంకరం రోడ్డు సిస్టర్ నివేదిత స్కూల్ సమీపంలోని తారక్ స్కైర్ అపార్ట్‌మెంట్‌లో సీహెచ్.శ్రీనివాస్ (55) వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి బాగా మద్యం తాగాడు. అతిగా మద్యం తాగొద్దని కుటుంబ సభ్యులు గట్టిగా మందలించారు. దీంతో అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి ఎలుకల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కొడుకు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గణనాథులకు ఘనంగా పూజలు

వినాయక నవరాత్రుల సందర్భంగా వాడవాడలా ఏర్పాటు చేసిన వినాయకులు ఘనంగా పూజలు అందుకుంటున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, భక్తులు మంటపాలను సందర్శించి గణేషుడికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. – సికింద్రాబాద్/ కంటోన్మెంట్/సనత్‌నగర్ జోన్ బృందం



సీతాఫల్‌మండి టీఆర్‌టీ కాలనీ గణనాథుడి వద్ద పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్



కంటోన్మెంట్: గణనాథుని మండపాలను సందర్శించి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గణేశ్



అడ్డగుట్ట: టీమ్ 24/ 7 అసోసియేషన్ ఆధ్వర్యంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

ఓయూ జేఏసీ అధ్యక్షుడిగా రహీమ్

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ బచావో మూవ్‌మెంట్ ఓయూ జేఏసీ అధ్యక్షుడిగా రహీం నియమితులయ్యారు. శుక్రవారం మూవ్‌మెంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి తనను నియమించిన్నట్లు తెలిపారు.

రోడ్డుపై వాకింగ్ చేస్తూ వ్యక్తి మృతి

అమీర్‌పేట: భోజనం చేశాక వాకింగ్ చేస్తూ కింద పడిపోయిన ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర జయ్‌పూర్‌లోని ఔరంగాబాద్‌కు చెందిన కె.నందకిషోర్ (22) నగరానికి వచ్చి సాఫ్ట్‌వేర్ కోచింగ్ తీసుకుంటున్నాడు. అమీర్‌పేట శివ్‌బాగ్‌లోని వైభవ్ హాస్టల్‌లో ఉంటున్న కిషోర్ గురువారం రాత్రి భోజనం చేశాక వాకింగ్ చేస్తూ కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. హాస్టల్ నిర్వాహకుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు మృతికి గల కారణాలపై విచారణ చేశారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాగా కిషోర్‌కు ఫిట్స్‌తో బాధపడుతూ సొంత ఊర్లోనే వైద్యం చేయించుకుంటున్నట్లు స్నేహితులు తెలిపారు.

గణేశ్ నిమజ్జనానికి భారీ భద్రత

'సాక్షి' ఇంటర్వ్యూలో గాంధీనగర్ డివిజన్ ఏసీపీ యాదగిరి



బన్సీలాల్‌పేట్: గణేశ్ నిమజ్జనోత్సవానికి పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సెప్టెంబర్ 6న జరిగే నిమజ్జనానికి విస్తృతమైన ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. వేలాది వినాయక విగ్రహాలు, లక్షలాది మంది పాల్గొనే నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరగడానికి సెంట్రల్ జోన్ పోలీసులు నిర్దిష్టమైన కార్యచరణను సిద్ధం చేశారు. భారీ ఎత్తున పోలీసుల బలగాలతో పాటు సీసీ కెమెరాల నిఘా నేత్రంతో ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు ప్రాంతాలను నిమజ్జనోత్సవానికి సర్వం సిద్ధం చేశారు. నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరిగేలా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు గాంధీనగర్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు(ఏసీపీ) యాదగిరి సాక్షి ముఖాముఖిలో పేర్కొన్నారు.

ప్రశ్న: నిమజ్జనోత్సవానికి చేస్తున్న ఏర్పాట్లు వివరించండి ?

ఏసీపీ: నెక్లెస్ రోడ్డు, ట్యాంక్‌బండ్‌పై గణేశ్ నిమజ్జనోత్సవానికి ఈసారి సుమారు 31 క్రేన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. పరిస్థితులను బట్టి క్రేన్ల సంఖ్యను పెంచామన్నారు. ప్రభుత్వ విభాగాలైన జీహెచ్‌ఎంసీ, ఆర్అండ్‌బీ, ట్రాన్స్‌కో, జలమండలి, రవాణా తదితర విభాగాలతో కలిసి భారీ ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతీ క్రేన్ వద్ద ఓసీసీ కెమెరాను ఏర్పాటు చేసి నిమజ్జనోత్సవ తీరుతెన్నులను పరిశీలించనున్నట్లు తెలిపారు. మూడో రోజు నుంచి ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో నిమజ్జనోత్సవం ప్రారంభమవుతుందన్నారు.

పోలీసు బందోబస్తు గురించి తెలపండి?

◆ గణేశ్ నిమజ్జనోత్సవానికి భారీ భద్రాతా ఏర్పాట్లు చేస్తున్నాం. ఉన్న సిబ్బందితో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి భారీ ఎత్తున అదనపు పోలీసు సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నాం. ఎస్పీ స్థాయి అధికారులతో పాటు డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, మహిళా కానిస్టేబుళ్లు బందోబస్తులో ఉంటారన్నారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నెక్లెస్ రోడ్డులో 500, ట్యాంక్‌బండ్ పరిసరాల్లో సుమారు 600 మంది పోలీసులు విధులు నిర్వహిస్తారు. ప్రత్యేక నిఘా కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

నిమజ్జనం ఎప్పటి నుంచి ప్రారంభమవుతుంది.?

◆ శనివారం ఉదయం 8 నుంచి ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో గణేశ్ నిమజ్జనం ప్రారంభమవుతుంది. మరిసటి రోజు అంటే 7 వరకు నిమజ్జనం నిరంతరాయంగా సాగుతున్నందన్నారు. నెక్లెస్ రోడ్డు, ట్యాంక్‌బండ్‌పై వచ్చే విగ్రహాలన్నింటిని నిమజ్జనం చేసేంత వరకు పోలీసులు విధి నిర్వాహణలో ఉంటారన్నారు.

గణేశ్ మండప నిర్వాహకులకు మీరిచ్చే సూచనలు, సలహాలు ఏంటి?

◆ గణేశ్ నిమజ్జనోత్సవం ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలి. వాహనాలపై గణేశ్ ప్రతిమలను తీసుకొని వచ్చిన నిర్వాహకులు తమకు కేటాయించిన క్రేన్ వద్ద విగ్రహాన్ని నిమజ్జనం చేయాలి. నెక్లెస్ రోడ్డు, ట్యాంక్‌బండ్‌పై వాహనాలను ఎక్కువ సేపు నిలిపి రాకపోకలకు ఇబ్బందులు కలిగించరాదు. అపరిచిత వ్యక్తులు, వస్తువులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ట్యాంక్‌బండ్‌పై ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

ఈ సంవత్సరం ఎన్ని వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తారని భావిస్తున్నారు ?

◆ నెక్లెస్ రోడ్డు, ట్యాంక్‌బండ్ గుండా వేలాది విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. ఈసారి మొదటి నుంచి చివరి వరకు సుమారు 40వేల విగ్రహాలు నిమజ్జనోత్సవానికి వస్తాయని భావిస్తున్నాం. గత సంవత్సరంతో పొల్చుకుంటే ఈసారి విగ్రహాల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయి. నెక్లెస్ రోడ్డుతో పాటు వివిధ ప్రాంతాల్లో నిమజ్జనోత్సవానికి వీలుగా జీహెచ్‌ఎంసీ చిన్న చిన్న కొలనులను ఏర్పాటు చేస్తుంది.

రైల్వేలో 121 మంది పదవీ విరమణ

అడ్డగుట్ట: దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 121 మంది ఉద్యోగులు శుక్రవారం పదవీ విరమణ చేశారు. హెడ్‌క్వార్టర్స్, సికింద్రాబాద్, హైద్రాబాద్ డివిజన్లతో పాటు లాలాగూడ వర్క్‌షాపుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు తోటి ఉద్యోగులు ఆత్మీయ వీడ్కోలతో సికింద్రాబాద్‌లోని కార్యాలయాలు సందడిగా మారాయి. అకౌంట్స్ విభాగంలో సికింద్రాబాద్ డివిజన్‌లో సీనియర్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరావు, లేఖా భవన్‌లో రాంబాబు, క్యాష్ ఆఫీస్‌లో పని చేస్తున్న రాఘవరావులను మజ్దూర్ యూనియన్ కార్యదర్శి రామకృష్ణ శాలువాతో సత్కరించారు.

చిన్నారిని చేరదీసిన గాంధీ సిబ్బంది



గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ప్రాంగణంలో ఒంటరిగా ఏడుస్తున్న చిన్నారిని సెక్యూరిటీ సిబ్బంది చేరదీశారు. చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శివాజీ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం 2గంటల సమయంలో గాంధీ అమూల్ క్యాంటిన్ వద్ద మూడేళ్ల వయసుగల చిన్నారి గుక్కపట్టి ఏడుస్తోంది. సెక్యూరిటీ సిబ్బంది చేరదీశారు. మచ్చిక చేసుకొని వివరాలు ఆరా తీయగా.. తనపేరు కార్తీక అని చెప్పిందని, తల్లితండ్రులు, ఇతర వివరాలు ఏమి చెప్పలేకపోతుందని వివరించారు. ప్రస్తుతం చిన్నారి తమ సంరక్షణలోనే ఉందని, తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు గుర్తించి తమను సంప్రదించాలని గాంధీ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శివాజీ తెలిపారు.

కంటోన్మెంట్ సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్యే శ్రీగణేశ్



కంటోన్మెంట్: నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా విని, వెంటనే పరిష్కరించేందుకు 'కంటోన్మెంట్ వాణి' పేరుతో కొత్త కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్, డీఈఓ దినేష్‌రెడ్డి, నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదను కలసి, ప్రతీ నెలా 10న జరగబోయే ఈ కార్యక్రమంలో అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. సీఈఓ మధుకర్ నాయక్ సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారంలో పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం తరహాలోనే కంటోన్మెంట్ వాణి కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు ఇకపై కార్యాలయాల చుట్టూ తిరగకుండా, అధికారులను వార్డుల వారీగా ఒకే చోటుకు తీసుకొచ్చి సమస్యలు విని తక్షణ పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ప్రారంభిస్తున్నామన్నారు. సెప్టెంబర్ 10న 1వ వార్డులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వివరించారు. అలాగే వర్షాకాలంలో జాగ్రత్తలు, జూబ్లీ బస్‌స్టేషన్ పార్కింగ్, సాయిబాబా హట్స్‌లో టాయిలెట్ సదుపాయాలు, చిన్న కమెలాలో రోడ్లు, బోర్‌వెల్స్, బస్తీ దవాఖానాల కోసం స్థలాల కేటాయింపు వంటి అంశాలపై కూడా సీఈఓతో ఎమ్మెల్యే చర్చించారు.